సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 28 । జూలై । 2023



వీరులకు వందనం

పడిమటి ప్రాంతాల్లో ఎత్తయిన శిల మీద చెక్కిన బొమ్మలు కనిపిస్తాయి. ఇవి పోరాట భంగిమలో ఉంటాయి. వీటి వెనక గొప్ప వీరుల కథలున్నాయి. -8లో..



సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్ట్

సెల్‌ఫోన్ దొంగల ముఠాను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన 17 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె వన్ టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1380	రూ.1600
రెండోరకం	రూ.1140	రూ.1370

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 386 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	370	474
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 699.54 కిలోలు

క్రికెట్ స్టేడియం పనులను వేగవంతం చేయాలి

రాయచోటి: రాయచోటి జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం రాయచోటి రూరల్ మండలం దిగువ అబ్బవరం గ్రామ పంచాయతీ, నక్కలవాండ్లపల్లి వద్ద 32.62 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారుల సమన్వయంతో పనులను వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. స్టేడియం ల్యాండ్ స్కేపింగ్ పనులు,రోడ్డు నిర్మాణం, స్టేడియం సరిహద్దుల చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణం ఏర్పాటు చేయడానికి అవకాశాలు తదితరాలపై రెవెన్యూ, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో ఆర్అండ్‌బి జిల్లా అధికారి సహదావరెడ్డి, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, తహశీల్దార్, రెవెన్యూ, ఆర్ అండ్‌బీ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

జగనన్న సురక్ష గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లో జిల్లా ఫస్ట్

జగనన్న సురక్ష గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్‌లో అన్నమయ్య జిల్లా మొదటి స్థానంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్‌కు అభినందనలు తెలిపారు. గురువారం జగనన్న సురక్ష, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, నాడు-నేడు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.వీసీ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రాకు సంబంధించిన కార్యక్రమాన్ని అక్టోబర్ 2వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. ఈ క్రీడలను అక్టోబర్ 2వ తేదీ నుంచి 46 రోజుల వరకు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. ఇందులో మొత్తం 2.99 లక్షల మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విదేశీ విద్య

- జిల్లాలో జగనన్న విదేశీ విద్యా దీవెన కింద 11 మందికి రూ. 1.51 కోట్లు
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: పేద, మధ్యతరగతి విద్యార్థుల పాలిట 'జగనన్న విదేశీ విద్యాదీవెన' వరమని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విదేశీ విద్యా దీవెన రెండో విడత లబ్ధి మొత్తాన్ని విద్యార్థుల ఖాతాల్లో జమ చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, వైఎస్సార్ ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషాలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం పేద విద్యార్థులకు వరం లాంటిదన్నారు. విదేశీ విద్యాసంస్థల్లో చదువుకోవాలన్న కోరిక ఉన్న వారికి ఈ పథకం దోహదపడుతుందన్నారు. అన్నమయ్య జిల్లాలో ఈ పథకం ద్వారా 2022-23 సంవత్సరానికి సంబంధించి మొత్తం 11 మంది విద్యార్థులకు ఒక కోటి 51 లక్ష 86 వేల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేశామన్నారు. పోటీతత్వంలో నిల దొక్కుకోవాలంటే మంచి యూనివర్సిటీలో చదవాలన్నారు. ఈ రోజు అమెరికాలోని సిలికాన్ సిటీలో 40 నుంచి 50 శాతం తెలుగు వారే ఉద్యోగం చేస్తున్నారన్నారు. విద్యార్థులు తమ కలలను కూడా సాకారం చేసుకోవాలన్నారు. జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి పేద విద్యార్థి చదవాలనే తలంపుతో దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ తీసుకొచ్చారన్నారు. తద్వారా లక్షలాది మంది డాక్టర్లు, ఇంజనీర్లు, ఎంబీఏ, ఎంసీఏ లాంటి ఉన్నత చదువులు అభ్యసించేందుకు కారకులయ్యారన్నారు. తండ్రికి తగ్గ తనయుడిగా సీఎం జగన్ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు నాడు-నేడుతో మారిపోయాయన్నారు. ప్రపంచంలోని టాప్ యూనివర్సిటీలలో చదవగలిగే ప్రతిభ ఉండి కూడా పేదరికం కారణంగా చదువుకోలేని విద్యార్థులకు బాసటగా నిలబడుతూ వారి విదేశీ విద్యకు అయ్యే పూర్తి ఫీజు జగనన్న ప్రభుత్వం భరిస్తుందన్నారు. మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా మాట్లాడుతూ పేదరికం పోవాలంటే చదవన్నదే గొప్ప అస్త్రం అన్నారు. ప్రతి పేదవాడు చదువుకోవాలనే సంకల్పంతో సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. కార్యక్రమం అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా చెక్కును కలెక్టర్, జెడ్పీ చైర్మన్, జేసీలు అందజేశారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్, జేసీలు

అదృష్టంగా భావిస్తున్నా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో విదేశీ విద్యను అభ్యసించే అవకాశం వచ్చింది. విదేశాల్లో చదువుకోవడానికి పూర్తి ఖర్చును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుండటం అదృష్టంగా భావిస్తున్నాం. పేద మధ్య తరగతి కుటుంబాల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

– సి.దీప, నేతివారిపల్లి, చిట్వేలి మండలం

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



నేను మదనపల్లె ఇంజినీరింగ్ కళావాలలో కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాను. బయట దేశాలలో మంచి కళాశాలలో చేరి రీసెర్చ్ చేసి ఏదో ఒకటి సాధించాలన్నది ఆశయం. విదేశాల్లో చదివించే ఆర్థికస్థోమత మా అమ్మ నాన్నలకు లేదు. విదేశీ విద్యాదీవెనతో సీఎం జగన్ అందిస్తున్న సహకారం కారణంగా నేను విదేశాలకు వెళ్లే అవకాశం దొరికింది. ఇంతటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మా కుటుంబమంతా రుణపడి ఉంటాం.

– బి.విలియం, మదనపల్లి, అన్నమయ్య జిల్లా

ఆగస్టు 1 నుంచి ఎఫ్ఏ–1 పరీక్షలు

రాయచోటి: జిల్లాలో ఆగస్టు నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఫార్మేటివ్ అసైన్మెంట్-1 పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు క్లాస్ రూమ్ బేస్డ్ అసైన్మెంట్ (సీబీఏ-1) విధానంలో ఓఎంఆర్ పరీక్షలు ఉంటాయన్నారు. 9.10తరగతుల వారు ఫార్మేటివ్ పరీక్షలు జవాబు పత్రాల్లో రాయాలని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల ప్రశ్నపత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.ప్రశ్నపత్రాలను అన్ని మండల విద్యాశాఖ కార్యాలయాలకు ఈనెల 28వతేదీ కల్లా చేరుస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్: అగ్నిపథ్ పథకంలో భాగంగా భారత వైమానిక దళంలో అగ్నివీర్ వాయు ఎంపికల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్ప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఆగస్టు 17వ తేదీలోపు అగ్నిపథ్‌వాయు.సీడీఏసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవివాహితులైన యువతీ, యువకులు 27-06-2003 నుంచి 27-12-2006 మధ్య పుట్టినవారు అర్హులన్నారు. ఇంటర్మీడియట్/10ప్లస్2 లో మ్యాథమాటిక్స్, ఫిజిక్స్, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. లేదా మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్‌సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మూడేళ్ల ఇంజినీరింగ్ డిప్లొమాతో పాటు ఇంగ్లీషు సబ్జెక్టు నందు 50 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలకు వాయుసేన వెబ్‌సైట్ చూడవచ్చని తెలిపారు.

నేడు నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం

రాయచోటి: అన్నమయ్య జిల్లా, రాయచోటి కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ గిరీషా పీఎస్ అధ్యక్షతన జరగనుంది. ఈ విషయాన్ని జిల్లా ఎస్సీ, సంక్షేమ, సాధికారిత అధికారి తెలిపారు. 2023-24 సంవత్సరం రెండో త్రైమాసికానికి సంబంధించి ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీఈడీ పరీక్షా కేంద్రాల తనిఖీ

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ పరీక్షలను వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కడపలోని పుష్పగిరి బీఈడీ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో విద్యార్థుల హాల్‌టికెట్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

టమాటా రైతు దాతృత్వం

తంబళ్లపల్లె: పంట దిగుబడి, మంచి ఆదాయం రావడంతో టమాటా రైతు మహిళా కూలీలకు గురువారం చీరలు వితరణగా ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని ఎద్దులవారిపల్లె పంచాయితీ గొడసానివారిపల్లె వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి ఒకటన్నర ఎకరంలో పంట సాగు చేశాడు. నేడు గుట్టుబాటు ధర రావడంతో పంట కోతకు వచ్చిన 13 మంది మహిళా కూలీలలకు, ఒక వ్యక్తికి దుస్తులు అందజేశారు. రైతు దాతృత్వానికి కూలీలు సంతోషం వ్యక్తం చేశారు.



కూలీలకు చీరలు పంపిణీ చేస్తున్న నరసింహారెడ్డి

ఆర్టీసీ స్టార్‌లైనర్ బస్సు చార్జీల తగ్గింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె-హైదరాబాదు-సికింద్రాబాద్‌కు నడుపుతున్న ఆర్టీసీ స్టార్‌లైనర్ బస్సులో చార్జీలు తగ్గించినట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఆదివారం తప్ప మిగిలిన రోజుల్లో తగ్గింపు ధరలు వర్తిస్తాయన్నారు. లోయర్‌బెర్త్ మదనపల్లె-హైదరాబాద్ రూ.1080, మదనపల్లె-సికింద్రాబాద్ రూ.1120, అప్పర్‌బెర్త్ మదనపల్లె-హైదరాబాద్ రూ.1000, మదనపల్లె-సికింద్రాబాద్ రూ.1030, లోయర్ బెర్త్‌కు రూ.250, అప్పర్‌బెర్త్‌కు రూ.230 తగ్గించినట్లు తెలిపారు.

క్లుప్తంగా

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : తల్లిదండ్రులు మందలించడంతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. కురబలకోట మండలం మట్లవారిపల్లెకు చెందిన భూపతిరెడ్డి కుమారుడు ఉమేష్‌రెడ్డి(19) తల్లిదండ్రులతో కలిసి బర్మావీధి సాయిబాబా గుడి వద్ద నివసిస్తున్నాడు. చదువుకోకుండా జులాయిగా తిరుగుతుండటంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన ఉమేష్‌రెడ్డి క్రిమి సంహారణ మందు తిని ఇంట్లోనే ఆత్మహత్యకు ప్రయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడ్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

మదనపల్లె : పాఠశాలలో టీవీ చోరీ చేసిన కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. ఈనెల 18న కోటబడి కోటవీధిలోని హోప్ ప్రైమరీ పాఠశాలలో స్మార్ట్ టీవీ చోరీకి గురైందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నీలిమ ఫిర్యాదు చేసిందన్నారు. ప్రభుత్వం డిజిటల్ తరగతుల నిర్వహణకు పంపిణీ చేసిన టీవీ విలువ రూ.50,000గా పేర్కొన్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు అనంతరం ఈశ్వరమ్మకాలనీకి చెందిన కుశాల్‌కుమార్(19) నిందితుడిగా నిర్ధారణ కావడంతో గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

తల్లీబిడ్డలు అదృశ్యం


రోజమ్మ (ఫైల్)



దీపిక (ఫైల్)

మదనపల్లె : తల్లీబిడ్డలు అదృశ్యం కావడంపై కేసు నమోదు చేసినట్లు తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని మాలేపాడు పంచాయతీ ఆవులపల్లెకు చెందిన కృష్ణమూర్తి భార్య రోజమ్మ(32), కుమార్తె దీపిక(7) ఈ నెల 24న ఇంటి నుంచి వెళ్లి కనిపించలేదన్నారు. రెండు రోజుల పాటు ఆమె భర్త వారి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో 26న తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. ఆమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వారి ఆచూకీకై గాలిస్తున్నామన్నారు.

వీరులకు వందనం

పడిమటి ప్రాంతాల్లో అక్కడక్కడా కొన్ని రాతి మండపాలూ... వాటిలో ఎత్తయిన శిల మీద చెక్కిన బొమ్మలు కనిపిస్తాయి. ఈ బొమ్మలు పోరాట భంగిమలో ఉంటాయి. ఇవి దయగల వారెవరో కట్టించిన మండపాలు కావు. వీటి వెనక గొప్ప వీరుల కథలున్నాయి. పౌరుషాల నేల రాయలసీమ. వీరులను కీర్తించే, పూజించే, గౌరవించే సంప్రదాయం శతాబ్దాల నాటిది. సామంతులుగా బాణులు, వైదుంగులు పాలించే కాలంలో సరిహద్దు పోరాటాలు ఉధృతంగా సాగాయి. పాలెగాళ్ల కాలంలో దోపిడీ ముఠాల దాడులు జరిగాయి. వీరిని ఎదుర్కొన్న యోధులకు గుర్తుగా వారిని శిలల మీద చెక్కారు. ఇటువంటి శిలలు సీమలో 300 వందలకు పైగా ఉన్నాయి. వీటిలో 127 ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే ఉన్నాయి.

- చరిత్రకు సాక్ష్యంగా శిలలు
- పడమటి ప్రాంతంలో ఆరో శతాబ్దం నాటి ఆనవాళ్లు


బి.కొత్తకోట మండలం ఆలేటివారిపల్లె సమీపంలో కత్తి వీరయ్య సమాధిపై ఉన్న వీరశిల


ములకలచెరువు మండలం గూడుపల్లె సమీపంలో చెన్నకేశవ సమాధిపై ఏర్పాటు చేసిన శిల

ములకలచెరువు : పడమటి ప్రాంతాలకు 2500 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. అందుకు తగిన ఆధారాలు ఉన్నాయి. శాతవాహనులు, పశ్చిమ చాళుక్యులు, తూర్పు చాళుక్యులు, పల్లవులు, పాండ్యులు, చోళులు, విజయనగర రాజులు పాలించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. రాజులు పాలించిన కోటలు, బురుజులు, తెలుగు, తమిళ శాసనాలు నాటి వైభవాన్ని చాటి చెబుతున్నాయి. ఇవన్నీ రాజుల వైభవ చిహ్నాలు, వారి విజయాలకు గుర్తులు, అయితే రాజులే గాక సాధారణ మనుషులను ఊళ్లు కీర్తించిన విశేష ఆధారాలు పడమటి పల్లెల్లో కొల్లలుగా ఉన్నాయి. వీటిని వీరగాళ్లు లేదా వీరశిలలు అని పిలుస్తుంటారు. నదుల ఒడ్డునో, చెరువు గట్టుమీదో, ఊరి శివారులోనో ఎత్తయిన రాతి శిల్పాలు కనిపిస్తాయి. కూలిపోయి, శిథిలమైపోయి, విరిగి విధ్వంసం జరిగిపోయి కన్పించే ఇవన్నీ నాటి వీరుల జ్ఞాపక చిహ్నాలు, గౌరవ వందనాలు. దోపిడీ దొంగలు ఊళ్లమీద పడి చేసే అరాచకాలను ఎదుర్కొని వీరమరణం పొందిన ఊరు వీరుల గురుతులు ఇవన్నీ. ఇవి చాలా వరకు అంతరించిపోయాయి. అక్కడక్కడా మిగిలిన కొన్నింటి మీద కత్తులు పట్టుకున్న వీరుల బొమ్మలుంటాయి. ఈ బొమ్మలు చెక్కిన రాతి మీద ఆ వీరుడి కథ ఉంటుంది. ఒకప్పుడు వీరులు అమరులైతే వీరశిలల వద్ద పూజలు, జాతర్లు, కొలుపులు నిర్వహించేవారు. వీరుడు చూపిన పరాక్రమం గురించి పాటలు కట్టి పాడుకునేవారు. ఆరో శతాబ్దంలో పశ్చిమ చాళుక్య చక్రవర్తి రెండో పులకేసి కాలం నుంచి అమరవీరులను స్మరించుకునే సంప్రదాయం ఉన్నట్లు గతంలో ఈ ప్రాంతంలో వెలుగు చూసిన శాసనాల ద్వారా తెలుస్తోంది. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, బి.కొత్తకోట, తంబళ్లపల్లె, కురబలకోట మండలాల్లో తెలుగువీరుల పరాక్రమం, పౌరుషాన్ని తెలిపే వీరశిలలు ఉన్నాయి. బి.కొత్తకోట బీసీ కాలనీ రోడ్డుపక్కన, కురబలకోట రైల్వేస్టేషన్ సమీపంలో గతంలో గుప్తనిధుల ముఠా పగులగొట్టడంతో ముక్కలైన వీరశిలలు ఉన్నాయి.

వీరుడు చెన్నకేశవ

దొంగలు ఊళ్ల మీద పడి అరాచకం చేస్తున్న కాలం అది. చీకటి దట్టంగా అలుముకున్నాక.. ఊరు ఆదమరిచి ఉన్న వేళ దివిటీ దొంగలు ఊళ్ల మీద పడి కొల్లగొట్టేవాళ్లు. ధాన్యం, బంగారు, స్త్రీలు, సమస్తం వీరి వశమయ్యేవి. వీళ్లని దివిటీ దొంగలు అనే వాళ్లు. వీరు దాడి చేస్తే ఊళ్లకు ఊర్లు వణికిపోయేవి. ములకలచెరువు మండలంలోని గూడుపల్లె సమీపంలో పాపాఘ్ని ఒడ్డున ఉన్న అప్పట్లో పిలవబడే చెన్నప్పగారిపల్లె అగ్రహారం మీద దివిటీ దొంగలు దాడి చేశారు. అగ్రహారాన్ని కాపాడుకునేందుకు ఊరు తిరగబడింది. దివిటీ దొంగలతో భీకర పోరాటం జరిగింది. వీరుడు చెన్నకేశవ నాయకత్వంలో ఊర్లోని యువకులు ఆత్మరక్షణ పోరాటం సాగించారు. ఈ పోరులో చెన్నకేశవతోపాటు ఆయన అనుచరులు కొందరు వీరమరణం పొందారు. చనిపోయిన వీరులను పాపాఘ్ని ఒడ్డున శ్మశానంలో పాతిపెట్టారు. దళపతి వీర చెన్నకేశవ సమాధిపై ఆయన పోరాట చిత్రాన్ని రాతి మీద చెక్కించారు. కత్తి, డాలు పట్టుకున్న విగ్రహం ఇది. ఆనాటి పోరాట వివరాలనూ ఈ రాతి మీద చెక్కించారు. దివిటీ దొంగలతో పోరాడి నేలకొరిగిన వీరుడికి మండపం కూడా కట్టించారు. ఊరి వీరులకు ఆనాటి ప్రజలు ఇచ్చిన గౌరవం ఇది. 12వ శతాబ్దంలో ఈ పోరాటానికి సాక్ష్యంగా ములకలచెరువు మండలం గూడుపల్లె పంచాయతీ చెరువుకిందపల్లె శ్మశానంలో బలిజ వీరుడు వీర చెన్నకేశవ పేరిట ప్రతిష్ఠించిన వీర శిల ఇప్పటికీ ఉంది.

అమరవీరుడు కత్తి వీరయ్య

ఆ పల్లెలకు కంటి మీద కునుకు కరువైంది. రాత్రి అయ్యిందంటే భయం. దొంగల గుంపులు వాలిపోయేవి. అందినవన్నీ దోచుకోవడం, అడ్డొచ్చిన వారిని తెగ నరకడం, నచ్చిన ఆడవాళ్లను చెరబట్టడం చేసేవారు. ఈ దురాగతాలను వీరయ్య ఎదుర్కొన్నాడు. తన ఊరి వారిని పోగేసి పోరాట శిక్షణ ఇచ్చాడు. వీరయ్య కత్తి యుద్ధంలో ఆరితేరిన వాడు. ఆయన చేతిలో కత్తి ఉందంటే ఎదురు నిలిచే దమ్ము ఎవరికీ ఉండేది కాదు. ఎన్నో దోపిడీ ముఠాలను కత్తి వీరయ్య దళం మట్టుబెట్టింది. దోపిడీ దొంగలతో జరిగిన భీకరపోరులో వీరయ్య మరణించాడు. ఈ అమరవీరుడి కోసం కన్నీళ్లు పెట్టుకోవడమే గాక ఊరు గర్వంగా గుర్తు పెట్టుకుంది. ఇప్పుడు బి.కొత్తకోట మండలం ఆలేటివారిపల్లె శివార్లలో కనిపించే ఏడు అడుగుల ఎత్తయిన వీరశిల కత్తి వీరయ్యదే. ఎనిమిదో శతాబ్దంలో జరిగిన పోరు సంగతులు, కత్తి వీరయ్య పరాక్రమం గురించి వీరశిలపై దేవనాగరి లిపిలో శాసనం చెక్కారు. ఈ శాసనం అరుదైనదిగా పరిశోధకులు చెబుతున్నారు. ములకలచెరువు మండలం పెద్దపాళ్యం పంచాయతీ రామానాయునికోట సమీపంలో పెద్దేరు ఇడ్డున కూడా వీరశిల ఉంది. 11వ శతాబ్దంలో ఈ వీరశిలను ఏర్పాటు చేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది.

అభివృద్ధి పనుల ప్రారంభం


విద్యుత్ శాఖ ఎండీలను సన్మానిస్తున్న విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ నాగార్జునరెడ్డి

వీరబల్లి(రాజంపేట) : మండల పరిధి గడికోట గ్రామ పంచాయతీలోని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ నాగార్జునరెడ్డి స్వగ్రామమైన ఎడపల్లిలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన గురువారం ప్రారంభించారు. ముందుగా పెద్దూర్ కస్బాలో భారతీయ స్టేట్ బ్యాంకును ప్రారంభింపజేశారు. ఎడపల్లిలో నిర్మించిన సీసీ రోడ్లు, మాండవ్య నదిపై నిర్మించిన కాజ్‌వేను ప్రారంభించారు. అనంతరం ఎడపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేడు ప్రభుత్వం ప్రజల కోసం పని చేస్తుందని అన్నారు. ప్రజల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ప్రజలకు, రైతులకు, పారిశ్రామిక రంగాలకు విద్యుత్ కొరత లేకుండా సరైన మార్గంలో అవసరాన్ని బట్టి సరఫరా చేస్తున్నారన్నారు. విద్యుత్ పట్ల ఎటువంటి ఆటంకాలు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వీరబల్లి మండలంలో కోట్ల రూపాయలతో విద్యుత్ పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. దీంతో వీరబల్లి భారత దేశంలోనే ప్రఖ్యాతికి ఎక్కుతుందన్నారు. అనంతరం విద్యుత్ పవర్ ప్రాజెక్టు ఎండీ రమణారెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎండీ కమలాకర్‌బాబును నాగార్జునరెడ్డి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, గాలివీటి మదన్‌రెడ్డి, జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు, ఎంపీడీఓ మల్లేశ్వరి, గడికోట గ్రామ సర్పంచ్ సుబ్బరాయుడు, నారాయణస్వామి, ఎంపీటీసీ జ్యోతిర్మయి, పిచ్చిరెడ్డి, నాగూర్‌రెడ్డి, ధర్మారెడ్డి, రాఘవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు


సతీష్‌ను కాపాడిన ఎస్‌ఐ, పోలీసులు

సిద్దవటం : మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్న వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బద్వేలుకు చెందిన సతీష్(55) కుటుంబ తగాదాల కారణంగా జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఆయన కుమారుడు రామకుమార్ నంబర్ 100కు డయల్ చేసి తన తండ్రి సెల్‌పోన్ నంబర్ చెప్పడంతో.. లోకేషన్ ఆధారంగా గుర్తించారు. ఎస్‌ఐ సిబ్బందితోపాటు 20 నిమిషాల్లో కనుమలోపల్లె సమీపంలో ఉన్న రైల్వేట్రాక్ వద్దకు చేరుకున్నారు. పట్టాలపై పడుకున్న సతీష్‌ను లేపి, ఇలాంటి అఘాయిత్యాలు చేసుకోవద్దని కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం అయన కుటుంబీకులకు సమాచారం ఇచ్చి అప్పజెప్పారు. సతీష్ విద్యుత్ శాఖలో లైన్‌మ్యాన్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ, సిబ్బందిని జిల్లా ఎస్పీ అన్బురాజన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ చంద్రానాయక్, పోలీసులు నాగరాజు, ఎస్‌ఐ డ్రైవర్ ప్రదీప్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి శిక్ష

రాయచోటి టౌన్ : డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ ఏజేఎఫ్‌సీఎం జడ్జి డాక్టర్ ఎస్‌ఎం టీకే శారదా తీర్పు చెప్పారు. గురువారం రాయచోటి ట్రాఫిక్ ఎస్‌ఐ మహమ్మద్ రఫీ రాయచోటి పట్టణ పరిధిలోని వివిధ ప్రధాన కూడళ్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. రాయచోటి పట్టణానికి చెందిన షేక్ ముబారక్, వీరబల్లి మండలం మట్లి వడ్డెపల్లెకు చెందిన రావూరి వెంకటేశ్వర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు నిర్ధారించారు. వీరిపై కేసు నమోదు చేసి, కోర్టుకు హాజరు పెట్టారు. ఒక్కొక్కరికి మూడు రోజులు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో.. మహిళకు తీవ్ర గాయాలు

సంబేపల్లె : మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై గురువారం ఆగివున్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శెట్టిపల్లె పంచాయతీ తాటికుంట దళితవాడకు చెందిన ఇసుకపల్లె భారతి దేవపట్లలో జరుగుతున్న వారపు సంతకు ఆటోలో వెళుతోంది. దేవపట్ల జిల్లా పరిషత్ పాఠశాల సమీపంలోకి రాగానే ఆగివున్న ట్రాక్టర్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న భారతికి తీవ్ర గాయాలయ్యాయి. 108 సాయంతో ఆమెను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగల ముఠా అరెస్ట్

రూ.5 లక్షల విలువైన 17 ఫోన్‌లు స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లు

మదనపల్లె : సెల్‌ఫోన్ దొంగల ముఠాను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.5 లక్షల విలువైన 17 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. పట్టణంలోని పూలవీధికి చెందిన కె.ఈశ్వర్‌కుమార్(27), త్యాగరాజు వీధికి చెందిన షేక్ మహమ్మద్ ఫాజిల్‌హుస్సేన్(20), పోతులప్పవీధికి చెందిన గోయల్ అక్షయ్‌కుమార్(21), పొన్నూటిపాళ్యం పంచాయతీ పనసమాకుల పల్లెకు చెందిన కలికిరి యుగంధర్(19), కలికిరి మండలం మహల్ పంచాయతీ ఎర్రదొడ్డిపల్లెకు చెందిన ఎస్.సాయినరసింహ(23)లు ముఠాగా ఏర్పడి పట్టణ పరిసర ప్రాంతాల్లో గత కొంత కాలంగా మొబైల్‌ఫోన్‌ల చోరీకి పాల్పడుతున్నారన్నారు. అపరిచితుల వద్ద ఫోన్ చేసుకుని ఇస్తామంటూ సెల్‌ఫోన్ తీసుకుని పారిపోతూ చోరీలు చేస్తున్నారన్నారు. సెల్‌ఫోన్ చోరీలతో వచ్చిన డబ్బులు విలాసాలకు వినియోగిస్తూ చెడు వ్యసనాలకు బానిసలయ్యారన్నారు. దురలవాట్ల కారణంగా తరచూ దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న బాధితులు ఫిర్యాదు చేయడంతో నిందితుల గాలింపుకై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా ఉంచామన్నారు. నెలరోజుల అనంతరం క్రైమ్ పార్టీ, ఐడీ సిబ్బంది నిందితులను ఒక్కొక్కరిని చాకచక్యంగా అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో సెల్‌ఫోన్‌ల చోరీ బాగోతం బయటపడిందన్నారు. వారిచ్చిన పక్కా సమాచారంతో రూ.5 లక్షల విలువైన 17 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను పట్టణ సరిహద్దు ఆర్చివద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

విషజ్వరంతో యువకుడి మృతి


వెంకటేష్ మృతదేహం

మదనపల్లె : విషజ్వరంతో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగింది. పీటీఎం గ్రామానికి చెందిన బాబన్న కుమారుడు వెంకటేష్(28) వారం రోజులుగా విషజ్వరంతో బాధపడుతూ బి.కొత్తకోటలో చికిత్స పొందాడు. గురువారం అకస్మాత్తుగా పరిస్థితి విషమించి ఫిట్స్ రావడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి వెళ్లాల్సిందిగా సూచించారు. బాధితుడ్ని తరలించేలోపు ఆస్పత్రిలోనే మృతి చెందాడు.

జిల్లా సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక


జట్టుకు ఎంపికైన బాలికలతో నిర్వాహకులు

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం మిషన్‌కాంపౌండ్‌లోని మైదానంలో గురువారం జిల్లా సబ్ జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక కార్యక్రమం జరిగింది. జిల్లా నుంచి సుమారు 120 మంది బాల,బాలికలు పాల్గొన్నారు. మొదట హాకీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఎల్.జి.గిరిరావు మృతికి క్రీడాకారులు మౌనం పాటించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ దిలీప్‌కుమార్ ప్రకటించారు.

బాలికల జూనియర్ జట్టు

తన్మయ, హారిక, మునివర్ష, రెడ్డి సహస్ర, ప్రత్యక్ష, సారకొనైన్, నాగసాయిదీత్యా, తేజశ్రీప్రసాద్, జ్యోష్ణ, లిఖితరెడ్డి, వీణాప్రియ, మహాలక్ష్మి, వైష్ణవి, వర్షాభాయ్, జాహ్నవి, నేహారెడ్డి

బాలుర జూనియర్ జట్టు

ప్రవీణకుమార్‌నాయక్, మోహన్ నరసింహ, రాకేష్ నాయక్, నితీష్, నిశ్చల్‌సాయి, సుదీప్, పవన్‌కుమార్, చైతన్య, అబ్దుల్ రెహమాన్, చరితరాయల్, వరుణ్‌కుమార్, రాఘవేంద్ర నాయుడు, వెంకటేష్, నిఖిల్ ప్రేమ్‌చంద్, ఉజ్వల్‌కుమార్, మహమ్మద్‌అయాన్, ఫైజాన్‌ఖాన్, శశాంక్, స్టాండ్ బైలుగా గగన్‌దీప్, అక్షయ్‌నాయక్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు మురళీధర్, కమలేష్, షూటింగ్‌బాల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు, పీడీలు భద్రయ్య, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల కుటుంబాలకు సాయం


పీఎస్ రాయుడు భార్యకు రూ.6 లక్షల చెక్కు అందజేస్తున్న డిపో మేనేజరు రమణయ్య

రాజంపేట : ఆర్టీసీలో పని చేస్తూ ఆకస్మిక మరణం చెందిన కార్మికుల కుటుంబాలకు ఆర్టీసీ రూ.18 లక్షల సాయం అందించినట్లు రాజంపేట డిపో మేనేజరు గుండాల రమణయ్య అన్నారు. గురవారం తన కార్యాలయంలో ముగ్గురు కార్మికుల కుటుంబాలకు డీఎం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎల్‌డీఎఫ్ స్కీం కింద ఒక్కొక్కరికి రూ.6 లక్షలు మంజూరు అయిందన్నారు. ఆ నగదును మృతుల భార్యలకు అందజేయడం జరిగిందన్నారు. డిపో పరిధిలో డ్రైవర్లు పీఎస్ రాయుడు, ఎంఎస్ రాజు, ఎంపీ రాజు ఆకస్మిక మరణానికి గురయ్యారన్నారు. కార్యక్రమంలో డిపో కార్యాలయ అధికారులు మోడపోతుల రమణయ్య, బాలుగారి శివయ్య, గండికోట నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సారా విక్రయాలపై దాడులు


నిందితురాలిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

మదనపల్లె : పట్టణంలోని నక్కలదిన్నెలో ఎస్‌ఈబీ అధికారులు జరిపిన విస్తృత దాడుల్లో 295 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, అక్రమంగా సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... నక్కలదిన్నెలో జరిపిన దాడుల్లో బాబునాయక్ భార్య బాణావత్ శ్రీలత అలియాస్ తులసి(25) అక్రమంగా సారా విక్రయిస్తున్నట్లు తేలడంతో ఆమె వద్ద నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. అలాగే నక్కలదిన్నె పొరంబోకు స్థలాల్లో అక్కడక్కడా ముళ్లపొదల్లో అమ్మకానికి సిద్ధంగా దాచిపెట్టిన 560 సారా ప్యాకెట్లు (280లీటర్లు) స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి సొంతదారులకై విచారణ చేస్తున్నట్లు తెలిపారు. నాటుసారా విక్రయిస్తూ పట్టుబడిన బాణావత్ శ్రీలతను కోర్టులో హాజరుపరిస్తే మేజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

ఎస్‌ఈబీ అధికారులు వేధిస్తున్నారని ఆవేదన

మదనపల్లె : గతంలో చేస్తున్న నాటుసారా, కర్ణాటక మద్యం వ్యాపారాలు వదిలేసినా, ఎస్‌ఈబీ అధికారులు వదలిపెట్టకుండా బెదిరిస్తున్నారని ఓ బాధితుడు వాపోయాడు. వారి వేధింపులకు భయపడి కోర్టులో బెయిల్ తెచ్చుకున్నా.. సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు తీసుకెళ్లి స్టేషన్‌కు రావాల్సిందిగా భయపెడుతున్నారని చంద్రాకాలనీకి చెందిన శివనాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆయన గురువారం విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నాడు. ఈ నెల 7వతేదీన తమకు బంధువైన వెంకటరమణనాయక్ ఓటికొండ తండా వద్ద అక్రమంగా నాటుసారా తరలిస్తుండగా పోలీసులు వెంటపడ్డారన్నారు. దీంతో వెంకటరమణనాయక్ సారా మూటలను అక్కడే పడేసి ద్విచక్ర వాహనంలో పరారయ్యాడన్నారు. మూటలు విసిరే క్రమంలో జేబులో సెల్‌ఫోన్ కింద జారిపడిపోవడంతో గమనించకుండా వచ్చేశాడన్నారు. తర్వాత ఎస్‌ఈబీ సిబ్బంది సారామూటలను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారన్నారు. ఫోన్‌లో తన నంబర్ ఉండటంతో అదేరోజు రాత్రి 2.50 గంటలకు తనకు ఫోన్ చేసి నీకు సారా సరఫరా చేసే వెంకటరమణనాయక్ తమ అదుపులో ఉన్నాడని స్టేషన్‌కు రావాల్సిందిగా కోరారన్నారు. తాను గతంలో సారా వ్యాపారం చేసిన మాట వాస్తవమేనని, ఇద్దరు కుమారులు చక్కగా చదువుకుంటూ, కానిస్టేబుల్ ఉద్యోగ పరీక్షలు రాయడంతో వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యాపారం పూర్తిగా మానేసినట్లు చెప్పానన్నారు. తన ఇంట్లో సోదాలు నిర్వహించారన్నారు. ఎలాంటి సరుకు లభించకపోవడంతో తాము రాత్రి స్వాధీనం చేసుకున్న వెంకటరమణనాయక్‌కు సంబంధించిన సారామూటలను తీసుకువచ్చి ఇంటి ముందు పెట్టి ఫొటోలు తీసుకోవడం చేశారన్నారు. దీనిపై తన భార్య, కుమారులు ప్రశ్నించడంతో, చేసేదిలేక ఇంటిలోకి వెళ్లి తన సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు తీసుకువెళ్లారన్నారు. ఉదయం కోర్టు కానిస్టేబుల్ చంద్రా.. వెంకటరమణనాయక్‌కు ఫోన్ చేసి అక్రమసారా తరలింపు కేసులో ఇద్దరిపై కేసు నమోదుచేసినట్లు చెప్పడంతో కోర్టులో లొంగిపోయి బెయిల్ తెచ్చుకున్నామన్నారు. కేసులో ప్రధాన నిందితుడైన వెంకటరమణనాయక్ సారా రవాణాలో శివానాయక్‌కు సంబంధం లేదని చెప్పినప్పటికీ ఎస్‌ఈబీ పోలీసులు తనను విడిచిపెట్టకుండా తన సెల్‌ఫోన్‌ను వారి ఆధీనంలోనే ఉంచుకుని, డబ్బులు ఇవ్వాల్సిందిగా బెదిరిస్తున్నారన్నారు. తాము కోరిన డబ్బులు ఇవ్వని పక్షంలో అక్రమ కేసులు బనాయించి లోపలకు పంపేస్తామని భయపెడుతున్నట్లు వాపోయాడు. ఈ విషయమై ఎస్‌ఈబీ ఏఈఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఎస్‌ఈబీ సిబ్బందిపై బాధితులు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమన్నారు. అక్రమ మద్యం రవాణా, నాటుసారాపై దాడులు తప్పించుకునేందుకు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. శివానాయక్ సెల్‌ఫోన్ తమ వద్ద ఉన్న విషయం వాస్తవమేనని, అందులో కొందరు సారా తయారీదారులతోపాటు ఎస్‌ఈబీ సిబ్బంది ఫోన్ నంబర్లు ఉండటంతో డేటాను విశ్లేషిస్తున్నామన్నారు. ఆరోపణలపై పూర్తి స్థాయిలో విచారించి సిబ్బంది ప్రమేయం ఉంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.